
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 10 నవంబరు 2024

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

వెల్గటూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ శేఖర్‌లు కోరారు. శనివారం మండలంలోని అన్ని గ్రామాలలో సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఎన్యుమరేటర్లు సర్వే చేస్తున్న తీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. వివిధ గ్రామాలలో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరుగుతూ స్టిక్కర్లు వేసిన కుటుంబాల వివరాలు సేకరించారు. మొదటి రోజు ఎలాంటి అవాంతరాలు లేకుండా సర్వే సాఫీగా జరిగింది.

న్యూస్ బాక్స్

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

జగిత్యాల అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల నియోజవకర్గ పరిసర ప్రాంతాలకు చెందిన నిరుపేదలకు శనివారం పావని కంటి ఆస్పత్రి, ఆపి, రోటరీ క్లబ్ జగిత్యాల ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. 12 మందికి శస్త్ర చికిత్సల అనంతరం కంటి అద్దాలతో పాటు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శస్త్ర చికిత్సలను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్ విజయ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల ముకుందం, ఆరుముల్ల పవన్, రంగు మహేష్, శ్రీరాం భిక్షపతి, బోగ అరవింద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సత్య ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 9వ తేదీ, 10వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు.

జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా మల్లేష్

జగిత్యాల అర్బన్ 9 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా హైదరాబాద్ మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న మల్లేష్‌ను నియమించనున్నట్లు సమాచారం. జగిత్యాల కమిషనర్‌గా పనిచేస్తున్న సమ్మయ్యను కలెక్టర్ సరెండర్ చేయగా రాయికల్ ఎంపీడీవో చిరంజీవికి అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన ఇరువురు అధికారులు ఓ ప్రజాప్రతినిధి వద్ద ప్రయత్నాలు చేసినప్పటికీ వారి ప్రతిపాదనను తిరస్కరించి మల్లేష్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది.

- డిసెంబరు 4న విద్యార్థులకు న్యాస్ పరీక్ష
- జాతీయ స్థాయి సర్వే కోసం మూడేళ్లకోసారి నిర్వహణ..
- జిల్లాలో 20 వేలపైగా విద్యార్థులు హాజరు



న్యాస్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

అభ్యసనా సామర్థ్యాలు మెరుగయ్యేనా..?

జగిత్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించేందుకు జాతీయ స్థాయిలో నిర్వహించే న్యాస్‌లో లక్ష్యం మేరకు ఫలితాలు సాధించడానికి అధికార యంత్రాంగం కసరత్తులు చేస్తోంది. ప్రతీ మూడేళ్లకు ఒకసారి కేంద్ర ప్రభుత్వ ఎన్‌సీఈఆర్టీ జాతీయ సాధన సర్వే (న్యాస్) నిర్వహిస్తోంది. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 3, 6, 9వ తరగతులు చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు ఈ సంవత్సరం నవంబర్ 19న ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో పరీక్ష ద్వారా సర్వే నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారు. న్యాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) నిర్వహణ, విద్యార్థులను సిద్ధం చేయాల్సిన తీరుపై ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ పరీక్షను ప్రాథమిక స్థాయిలో మూడోతరగతి, ప్రాథమికోన్నత స్థాయిలో ఆరోతరగతి, ఉన్నత స్థాయిలో 9వతరగతి విద్యార్థులకు నిర్వహించ నున్నారు. ప్రతీరోజు ప్రత్యేక బోధనాభ్యసన ప్రక్రియను చేపడుతూ వారి సామర్థ్యాల ను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే న్యాస్ పరీక్షలో ప్రతిభ కనబర్చేందు కు విద్యార్థులకు మోడల్ పరీక్షలను మాక్ టెస్ట్‌ల రూపంలో మూడు సార్లు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆయా జిల్లా విద్యాశాఖ అధికారులకు దిశా నిర్దేశం చేసింది. ఈ మేరకు ఇటీవల మాక్ పరీక్ష జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు.

స్థానం మెరుగుదలకు ప్రయత్నం...

పాఠశాల స్థాయి విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు సన్నగిల్లుతున్నాయని 2017, 2021 సంవత్సరాల్లో నిర్వహించిన న్యాస్ ఫలితాలు వెల్లడించాయి. జాతీయ స్థాయిలో తెలంగాణకు మొదటి 20 స్థానాల్లోనూ చోటు దక్కలేదు. దీంతో ఈసారైనా మంచి ఫలితాలను రాబట్టాలనే లక్ష్యంతో కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఇందులో భాగం గానే ప్రాథమిక స్థాయిలో ఎఫ్ఎల్ఎన్, ఉన్నత స్థాయిలో లిప్ ప్రోగ్రాం ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ ద్వారా ఉపాధ్యాయులకు, అధికారులకు దిశనిర్దేశనం చేశారు.

మూడు మాక్ టెస్ట్ నిర్వహణ...

జిల్లా వ్యాప్తంగా డిసెంబర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి సాధన సర్వే పరీక్షకు సిద్ధం చేయడంలో భాగంగా మూడు మోడల్ పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. (తరువాయి 8వ పేజీలో)

తొలి రోజు 2.58 శాతం సర్వే

జిల్లాలో 8,680 ఇళ్లలో సర్వే నిర్వహించిన సిబ్బంది

జగిత్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వేను తొలి రోజు శనివారం 2.58 శాతం అధికారులు పూర్తి చేశారు. జిల్లాలో 3,36,076 ఇళ్లను సర్వే నిర్వహించడం కోసం గుర్తించారు. సర్వే నిర్వహణకు జిల్లాలో 2,110 మంది ఉద్యోగులకు వివిధ బాధ్యతలను అప్పగించారు. రెండు రోజులుగా ఇళ్ల వెరిఫికేషన్, స్టిక్కర్లు వేసే పనులు నిర్వహించి తాజాగా సర్వే షురూ చేశారు. తొలి రోజు జిల్లా వ్యాప్తంగా 3,36,076 ఇళ్లకు గానూ 8,680 ఇళ్లలో సర్వేను పూర్తి చేశారు. ఇంకా 3,27,396 ఇళ్లలో సర్వేను నిర్వహించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 2.58 శాతం సర్వే పూర్తి అయింది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల పరిధిలో 2.34 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 2.66 శాతం సర్వే పూర్తయింది. జిల్లాలోని జగిత్యాలలో 696 కుటుంబాలు, కోరుట్లలో 471 కుటుంబాలు, మెట్‌పల్లిలో 484 కుటుంబాలు, ధర్మపురిలో 149 కుటుంబాలు, రాయికల్‌లో 121 కుటుంబాలలో సర్వేను నిర్వహించారు.

వెల్గటూరు మండలంలో 142, సారంగపూర్‌లో 254, రాయికల్‌లో 251, పెగడపల్లిలో 378, మెట్‌పల్లిలో 420, మేడిపల్లిలో 248, మల్యాలలో 414, మల్లాపూర్‌లో 489, కోరుట్లలో 314, కొడిమ్యాలలో 487, కథలాపూర్‌లో 388, జగిత్యాల రూరల్‌లో 586, జగిత్యాలలో 97, ఇబ్రహీంపట్నంలో 311, గొల్లపల్లిలో 537, ఎండపల్లిలో 136, ధర్మపురిలో 469, బుగ్గారంలో 306, బీమారంలో 231, బీర్‌పూర్‌లో 301 కుటుంబాలలో సర్వేను అధికారులు పూర్తి చేశారు. జిల్లాలో అత్యధికంగా బీర్‌పూర్ మండలంలో 3.88 శాతం, బుగ్గారంలో 3.77 శాతం, అత్యల్పంగా ఎండపల్లిలో 1.16 శాతం, వెల్గటూరులో 1.19 శాతం సర్వే జరిగింది.

పర్యాటక అభివృద్ధి ప్రశ్నార్థకమేనా..?

- కొండగట్టులో పత్తాలేని రోప్‌వే..
- కలగానే కోతుల పార్క్

6



ధర్మపురి క్షేత్రంలో కార్తీక భక్తుల రద్దీ

- ఎనిమిదో రోజు ఘనంగా గోదావరి హారతి

7



ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

వీసీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

జగిత్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం హైద్రాబాద్ నుంచి సీఎస్ శాంతి కుమారి, ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానీయాలతో కలిసి జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో సమగ్ర సర్వే అంశంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వే లక్ష్యం మేరకు నిర్వహించాలన్నారు. సర్వే అంశంపై అధికారులకు పలు సలహాలు, సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్య ప్రసాద్, లోకల్ బాడీ అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డి, ఆర్డీవో మధుసూదన్ పాల్గొన్నారు.

ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ లత



రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లత

జగిత్యాలరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లత అన్నారు. జగిత్యాల రూరల్‌మండలంలోని పొలాస, తక్కళ్లపల్లి, కల్లెడ గ్రామాల్లో ప్యాక్స్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దళారులకు రైతులు ధాన్యాన్ని విక్రయించవద్దని, ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ధాన్యాన్ని రైతులు విధిగా ఆరబెట్టాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా ప్యాడీ క్లీనింగ్ మిషన్‌లు అందుబాటులో ఉంచాలని, సెంటర్లలో వరిధాన్యాన్ని శుభ్రపరిచి కొనుగోలు చేయలన్నారు. ఈకార్యక్రమంలో డీటీసీఎస్ వరప్రసాద్, ఎఫ్ఐ రాజేంద్రప్రసాద్, ఏపీఎం గంగాధర్, సీసీ శ్రీనివాస్, మార్కెటింగ్ కేంద్రాల సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

డీఈ రాజిరెడ్డి



కల్లెడ సబ్‌స్టేషన్ లో ఫీడర్ బ్రేకర్ ప్రారంభిస్తున్న డీఈ రాజిరెడ్డి

జగిత్యాలరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామని జగిత్యాల విద్యుత్‌శాఖ డివిజన్ ఇంజనీర్ ఏ. రాజిరెడ్డి అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫీడర్ బ్రేకర్‌ను డీఈ రాజిరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సోమన్‌పల్లి, సంఘంపల్లి, హబ్సీపూర్ గ్రామాలకు ఒకే ఫీడర్ ఉందని దీని వల్ల విద్యుత్‌లో కొంత అంతరాయం సమస్య ఏర్పడిందని తెలిపారు. నూతన ఫీడర్ బ్రేకర్ ఏర్పాటుతో కల్లెడ, సోమన్‌పల్లి గ్రామాలకు చాలా వరకు విద్యుత్ అంతరాయం తగ్గుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏఈ సుందర్‌నాయక్, విద్యుత్‌సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు నిర్ణయం అభినందనీయం

- హరి అశోక్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

జగిత్యాల అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించాలని సర్కారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా రీయింబర్స్‌మెంట్ దరఖాస్తులు చేయడం వల్ల రోజుల వ్యవధిలోనే స్క్రూటినీ ప్రక్రియ పూర్తయి వేగంగా బిల్లులు అందే అవకాశం ఉంటుందన్నారు. అలాగే రీయింబర్స్‌మెంట్ బిల్లుల స్క్రూటినీ బాధ్యతలను డీఎంఈ నుంచి తప్పించి ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు అప్పగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ద్వారా రీయింబర్స్‌మెంట్ బిల్లు కోసం ఒకటి లేదా రెండేళ్లు వేచి ఉండాల్సిన అవసరం తప్పడంతో ఉద్యోగులు, పెన్షనర్లకు ఎంతో ఊరట దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, పీసీ హన్మంతరెడ్డి, బి.ప్రకాశ్ రావు, యాకూబ్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

జగిత్యాలరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పశువులకు ఉచితంగా సరఫరా చేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను శనివారం జగిత్యాల రూరల్ మండలంలోని బాలపల్లి గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు టీకాలను వేశారు. వెటర్నరీ అధికారులు మాట్లాడుతూ గాలికుంటువ్యాధి ప్రాణాంతకమైందని, ఈ వ్యాధిబారి నుంచి పశువులను కాపాడడానికి టీకాలను ఇప్పించాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



కొనుగోలు కేంద్రాల వద్ద వడ్ల మ్యాచర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

బీర్‌పూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులకోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని తహసీల్దార్ ముంతాజోద్దిన్ అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలంలోని కమ్మునూర్, తాళ్లధర్మాం గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలోని ధాన్యపు కుప్పల నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సంర్భంగా తహసీల్దార్ రైతులతో మాట్లాడుతూ రైతుల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని, సన్న వడ్ల వచ్చే బోనస్‌ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ పరిశీలకులు శ్రీనివాస్, ఏఈవో వినోద్, సీఈవో రాజేంధర్, మాజీ సర్పంచ్‌లు మహిపాల్ రెడ్డి, మారుతి, రైతులు జోగి రెడ్డి ఉన్నారు.

కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలి

కథలాపూర్ : వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలని సెర్ప్ ఏపీఎం నరహరి సూచించారు. శనివారం మండలంలోని బొమ్మెన, తక్కళ్లపల్లి, గంభీర్‌పూర్, తాండ్ర్యాల, కథలాపూర్ గ్రామాల్లోని కేంద్రాలను తనిఖీ చేశారు. రైతుల వివరాలను డేటా ఎంట్రీ, పుస్తక నిర్వాహణ, రవాణా, కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తేమ 17 శాతం వస్తే ధాన్యం తూకం వేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీసీలు, వీవోఏలు ఉన్నారు.

గొల్లపల్లి : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ వరందన్ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం గొల్లపల్లి మండలం దమ్మన్న పేట, లక్ష్మీపూర్, తిర్మలాపూర్ (పీడీ) గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న కొనుగోళ్ల వివరాల గూర్చి నిర్వాహకులను, రైతులను అడిగి తెలుసుకున్నారు.

కొనుగోళ్లు మందకోడిగా సాగడం పట్ల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరబెట్టి, శుద్ధి చేసిన ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించాలన్నారు. తూకం వేసిన వరి ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు.

నరసింహుడి సన్నిధిలో జిల్లా జడ్జి పూజలు



జడ్జికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి నీలిమ కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. ఆలయం వద్ద ఆమెకు వేదపండితులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు ఆమెను ఘనంగా ఆశీర్వదించారు. అనంతరం ఆమెకు ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తా..

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రాయికల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలో శనివారం రూ.2 కోట్ల 80 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం రాయికల్ గుడేటి రెడ్డి సంఘం భవనంలో రాయికల్ పట్టణం, మండలానికి చెందిన 120 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను, 64 మంది ఆడ బిడ్డలకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయికల్ పట్టణం, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని, రాయికల్ పట్టణానికి రూ.5 కోట్ల 80 లక్షలు మంజూరయ్యాయన్నారు. మైతాపూర్, చెర్లకొండాపూర్‌లో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.కోటి 80 లక్షలు మంజూరు చేస్తామన్నారు. మండలంలోని ఎస్టీ తండాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామన్నారు. అనంతరం రాయికల్ మండలంలోని రామాజీపేట గ్రామ రామాలయంలో వార్షికోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు గ్రామాల్లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు రవీందర్ రావు, అచ్యుత రావు, కోల శ్రీనివాస్, మహేంద్ర బాబు, జీవన్ రెడ్డి, ముత్తన్న, సురేష్, పోచమల్లు గౌడ్, రవి, భిక్షపతి, రామ్మూర్తి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా మల్లేష్



మల్లేష్

రాయికల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షునిగా సింగరావుపేట గ్రామానికి చెందిన బర్కం మల్లేష్‌ను నియమిస్తూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాన కార్యదర్శిగా అల్లీపూర్‌కు చెందిన కొండపల్కల రత్నాకర్ రావు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా రాచమడుగు స్పందన, ప్రధాన కార్యదర్శిగా పెంద్రం కవితలను నియమించారు. తమ నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, జడ్పీ చైర్మన్ దావ వసంతసురేష్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

● ఒకే పేరు ఉన్నవారు ఒక సమూహంగా ఏర్పడ్డారు. వారు సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారు. శ్రీనివాస్ అనే పేరున్న వారిని ఒక్క చోటికి చేర్చాలని ఆచార్య శ్రీనివాస దైవజ్ఞ అనే ఆధ్యాత్మిక గురువు భావించారు. వాట్సప్‌ను అందుకు వేదికగా చేసుకుని 'మనమంతా శ్రీనివాసులం' అనే గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. కరీంనగర్‌కు చెందిన వూట్కూరి శ్రీనివాస్‌రెడ్డి ఆ గ్రూప్‌లో చేరి ఉమ్మడి జిల్లా శ్రీనివాసులను ఒక్కచోటికి చేర్చారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,036 మంది సభ్యులు ఈ గ్రూపులో ఉన్నారు. వీరందరూ కలిసి కరీంనగర్‌లో సమ్మేళనం నిర్వహించారు. సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ శ్రీనివాసుల ప్రస్థానంపై 'ఆదివారం ప్రత్యేకం'

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్


సమ్మేళనంలో పాల్గొన్న శ్రీనివాసులు

మనమంతా శ్రీనివాసులం

ఆదివారం ప్రత్యేకం

- శ్రీనివాస్ పేరు ఉన్న వారితో వాట్సప్ గ్రూప్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,036 మంది సభ్యులు
- ప్రతి నెలా సమ్మేళనాలు
- సామాజిక కార్యక్రమాల నిర్వహణ

జీవితంలో ఐశ్వర్యం, ఆరోగ్యం ఉంటే ఆనందమయంగా మారి అలా..అలా సాగిపోతూ ఉంటుంది. దానికి సృజనాత్మకత కూడా తోడైతే ఆ ఆనందం అవధులు దాటుతుంది. వినూత్నంగా ఆలోచించడం ఈనాటి తరానికి ఇష్టంగా మారింది. అలాంటి వైవిధ్యమైన ఆలోచనలు ఒక రూపం దాల్చి మనముందుకు వచ్చినపుడు అరే... ఇదేదో...చాలా బాగుందే.. అనిపిస్తుంది. అలాంటిదే ఈ 'శ్రీనివాసుల' కథ. 1970 దశకంలో ప్రతి ఇంటికి ఒక శ్రీనివాస్ ఉండేవారు.

ఆ శ్రీనివాసులందరికి ప్రస్తుతం 50 నుంచి 55 ఏళ్ల వయసు దాటే సమయం. 20వ శతాబ్దం వచ్చే సరికి కొత్త కొత్త నామధేయాలు రావడం మొదల య్యాయి. జాతకాల రీత్యా పుట్టిన నక్షత్రాలకు అనుగుణం గా పురోహితులు ఏదో ఒక అక్షరం సూచిస్తే అది కలిసేలా కొత్తకొత్త పేర్లు వాడుకలోకి వచ్చాయి. దానికి సినిమాల ప్రభావం, సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చి కొత్తకొత్త పేర్లు ప్రచారం లోకి రావడంతో దేవుళ్ల పేర్లు కాస్తా తెరమరుగుకావడమో, కొత్త రూపుతో రావడమో ప్రారంభమైంది.

శ్రీనివాస్ పేరుకు ప్రాచుర్యం కల్పించేందుకు..

ఆచార్య శ్రీనివాస దైవజ్ఞ అనే గురువుకు ఒక కొత్త ఆలోచన వచ్చింది. శ్రీనివాస్ అనే పేరుకు ఇదే చివరి తర మేమో, ఈ పేరును పెట్టుకునే వారు క్రమేపి తగ్గిపోతున్నారు.. దీనిని మళ్లీ ఒకసారి బహుళ ప్రాచు ర్యంలోకి తేవడంతోపాటు లక్ష మంది శ్రీనివాసులను ఒక చోటకు చేర్చి రికార్డు సృష్టించాలని ఆయన తలపెట్టారు. దీనికి సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ అయిన వాట్సప్‌ను ఎంచుకున్నారు. "మనమంతా శ్రీనివాసులం" అనే గ్రూపును ఆచార్య శ్రీనివాస దైవజ్ఞ 2021లో ఏర్పాటు చేశారు. శ్రీనివాస్ అనే పేరు ఉన్న వారందరిని ఆ గ్రూపులో చేర్చుతూ పోయారు. ఇలా ఆయన ఆరు గ్రూపులు ఏర్పాటు చేశారు. కాళేశ్వర క్షేత్రంలో ఉండే ఆచార్య శ్రీనివాస్ సంకల్పం తెలుసుకున్న


గ్రూపు అడ్మిన్ వూట్కూరి శ్రీనివాస్

2023లో ఉమ్మడి జిల్లా గ్రూపు

కరీంనగర్‌లో నివాసముండే వూట్కూరి శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి మనమంతా శ్రీనివాసులం.. అనే ఆరో నంబర్ గ్రూపులో ఆగస్టు 2023లో సభ్యుడిగా చేరారు. ఆచార్య శ్రీనివాస్‌తో ఫోన్ లోనే పరిచయం చేసుకున్నాడు. ఆయన మాటలు విని ఆయన లక్ష్యాన్ని నచ్చిన శ్రీనివాస్‌రెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లా శ్రీని వాసుల గ్రూపును ఏర్పాటు చేసేందుకు అనుమతి వ్వాలని కోరారు. అందుకు గురువు ఆమో దం తెలుపగానే వాట్సప్ గ్రూపు ప్రారం భించారు. గ్రూపు ప్రారంభించిన మూడు రోజుల్లోనే 900 మంది శ్రీనివాసులు అందులో చేరారు. ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఐదు గ్రూపుల్లో 5,036 మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తు తం రెండు తెలుగు రాష్ట్రాల్లో 23 మన మంతా శ్రీని వాసులం గ్రూపులు ఏర్పాటు కాగా 22 వేల మంది సభ్యులు వాటిలో చేరారు. సమస్త శ్రీని వాసులందరిని ఒక చోటకు చేర్చాలనే లక్ష్యం పెట్టుకున్నారు.

ప్రతినెల రెండో వారంలో సమావేశం

కరీంనగర్ శ్రీనివాసుల గ్రూపులు ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా 2024 సెప్టెంబరు 27న కరీంనగర్ లోని టీటీడీ కల్యాణమండపంలో ఒక ఆత్మీయ సమ్మేళనా న్ని నిర్వహించగా సుమారు 200 మంది దీనికి హాజర య్యారు. ప్రతి నెలా రెండవ వారంలో వీలైనంత మంది శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో సహా వచ్చి సమావేశమ వ్వాలని, అలా వచ్చిన వారు వంద, రెండువందలు తోచి నంత డబ్బును జమచేసి అనాథ ఆశ్ర మాల్లో ఉండేవారి కోసం వెచ్చిం చాలని నిర్ణయించుకున్నారు.

ధర్మపరిరక్షణ అనే అంశాన్ని కూడా వీరు తమ లక్ష్యాల్లో ఒకటిగా పెట్టుకున్నారు. ఊట్కూరి శ్రీనివాస్ రెడ్డి శ్రీనివాసుల గ్రూపు చేస్తున్న కార్యక్రమాలను గమనించిన కరీంనగర్ గంజ్ వ్యాపారస్తుల్లో 20 మంది ఒక గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. వారు మనమంతా శ్రీనివాసులమనే గ్రూపు కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించడానికి ముందుకు వచ్చారు. వీరి ప్రోత్సాహంతోనే శ్రీనివాసుల గ్రూపు వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చగా పీటీసీ ఎస్పీ శ్రీనివాస్ గౌరవ అతిథిగా దీనికి హాజరై సమావేశానికి హాజరైన వారందరికి మిల్లెట్స్‌తో భోజనాన్ని సమకూర్చారు.

ఆధ్యాత్మికం, ఆరోగ్యం, సామాజిక సేవ అనే కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న ఈ శ్రీనివాసుల గ్రూపులు వచ్చే జనవరి 10 నుంచి 14వ తేదీ వరకు తిరుపతి యాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే 250 మంది ఈ యాత్రకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లా కొడిమ్యాలకు చెందిన వూట్కూరి శ్రీనివాస్‌రెడ్డి యుఎస్‌ఏ రిక్రూటింగ్ కన్సల్‌టెన్సీలో ఉద్యోగం చేస్తూ మనమంతా శ్రీనివాసులం గ్రూపుల కార్యక్రమాలను నిర్వహిస్తు న్నారు. గంజ్ మిత్రుల సహకారంతో తెలంగాణ శ్రీనివాసు ల సేవా సమితి అనే సంస్థను కూడా ఏర్పాటు చేసి రిజిస్టర్ చేయించారు. దీని ద్వారానే సేవా కార్యక్ర మాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నామని శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.

సామాజిక రక్తదానాలు..

కనీసం లక్ష మందిని అయినా సమీకరించి వారం దరితో ఒక సమావేశం ఏర్పాటు చేసి రికార్డు సృష్టిం చాలన్నది మా గురువు ఆచార్య శ్రీనివాస్ దైవజ్ఞది అనే చెప్పే ఊట్కూరి శ్రీనివాస్‌రెడ్డి దానిని సామాజిక కార్యక్రమాల వైపు మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఐదు వేల మందికిపైగా ఈ గ్రూపులో చేరగా వీరందరి ద్వారా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తే ఎందరికో ప్రాణ దానం చేయవచ్చుకదా.. అని తలపెట్టిన ఆయన గ్రూపు ద్వారా రక్తదాన సభ్యులుగా చేరే వారిని ఆహ్వానించగా 1,024 మంది రక్తదానానికి సిద్ధపడుతూ తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. గడిచిన ఆరు నెలల్లో 200 మంది రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి 86 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ఈ 86 మందిలో లక్కీడిప్ ద్వారా నలుగురిని ఎంపిక చేసి చిందం శ్రీనివాస్ అనే గ్రూపు సభ్యుడు వారిని తిరుమల సుప్రభాత సేవకు సొంత ఖర్చులతో తీసుకవెళ్లారు. రక్తదానాన్ని ప్రోత్సహించ డానికే ఆయన ఈ లక్కీడిప్ పద్ధతిని ఎంచుకున్నానని చెబుతున్నారు.


రక్తదానం చేస్తున్న గ్రూపు సభ్యులు

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- వరకట్న వేధింపులే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ

సారంగాపూర్, నవంబరు, 9 (ఆంధ్రజ్యోతి) మండలంలోని రేచిపల్లి గ్రామానికి చెందిన పోగుల లత(23) అనే వివాహిత నిర్మల్ జిల్లా దస్తూరబాద్ మండలం, రేగోజీ పేట గ్రామంలో ఉరేసుకుని అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మృతి చెందింది. వరకట్నం కోసమే అత్తింటి వారు తమ బిడ్డను చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని లత తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం, రేచపల్లి గ్రామానికి చెందిన పోగుల రాజేశం మల్లీశ్వరి దంపతుల కూతురు లతను 2021లో రాగోజిపేటకు చెందిన చంద నాగరాజుకు ఇచ్చి వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో కట్నం కింద రూ. 5 లక్షలతో పాటు బంగారం, వెండి, ఇతర వస్తువులను అప్పగించారు. ఆరు మాసాలు గడిచిన తర్వాత అదనంగా మరో 4లక్షల వరట్నం కోసం అత్త, మామ, భర్త వేధింపులు మొదలు పెట్టారు. ఈ విషయమై పలు మార్లు పంచాయితీలు కూడా జరిగాయి. లత తల్లిదండ్రులు సారంగాపూర్ పోలీస్ స్టేసన్‌లో ఫిర్యాదు సైతం చేశారు.. ఈ క్రమంలో లత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని అత్తింటి వారు కుటుంబ సభ్యులకు శుక్రవారం సమాచారం అందించడంతో వెంటనే వారు అక్కడకు చేరుకున్నారు. తమ బిడ్డ ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకిరిస్తున్నారని లత కుటుంబీకులు ఆరోపిస్తూ నిర్మల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. లత తండ్రి పోగుల రాజేశం ఓ కేసులో 9 నెలల నుంచి ఛత్తీస్‌గఢ్ జైళ్లో ఉన్నాడు. తన భర్తను జైలు నుంచి విడుదల చేయాలని లత తల్లి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వేడకుంటోంది. శనివారం పౌరహక్కుల, ప్రజా సంఘాల నేతలు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం సంఘటన జరిగిన గ్రామానికి వెళ్లి వివరాలు తెలుసుకుని నిర్మల్ పోలీసులను కలిసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లతకు ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు.


కుమారుడితో లత(ఫైల్)

బైక్‌ను ఢీ కొట్టిన లారీ

- భర్త మృతి.. భార్యకు తీవ్ర గాయాలు

శంకరపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీ కొట్టడంతో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలైన సంఘటన శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, తెలిపిన వివరాల ప్రకారం శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి సుధాకర్ రెడ్డి(72) అనే రైతు కల్లంలో ధాన్యం ఆరబెట్టడానికి భార్య సుజాతతో కలిసి కాచాపూర్ నుంచి బైక్‌పై బయలుదేరాడు. మొలంగూర్-వీణవంక రోడ్డులో ఆముదాలపల్లి వైపు మూల మలుపు తిరుగుతుండగా వీణవంక వైపు మానేరు వాగులో ఇసుక కోసం వెళ్తున్న లారీ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో భార్య, భర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న సుధాకర్‌రెడ్డి కొడుకు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని కారులో కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సుధాకర్‌రెడ్డి మృతి చెందాడు. తీవ్ర గాయాలైన సుజాతను ఆస్పత్రిలో చేర్పించారు. సుధాకర్‌రెడ్డి మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

ముస్తాబాద్, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై సీహెచ్ గణేశ్ తతిపిన వివరాల ప్రకారం స్థానికంగా ఉన్న చర్లపెద్దమ్మ ఆలయంలో దొంగలు చోరీ చేశారు. పుస్తెమట్టెలతో పాటు, హుండీలోని డబ్బులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నీరటి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

మంథని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు మంథని ఎస్ఐ రమేష్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా ప్రజా పంపిణీ బియ్యాన్ని రవాణా చేస్తున్నారని అందిన సమాచారం మేరకు సివిల్ సప్లై అధికారులతో సంయుక్తంగా సిరిపురం గోదావరి బ్రిడ్జి వద్ద టిఎస్ 08 ఈబి5174 గల వాహనాన్ని ఆపి తనిఖీ చేశామన్నారు. అందులో ప్రజా పంపిణీ బియ్యం 25 ప్లాస్టిక్ సంచుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. బియ్యం వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో పాటు అక్రమంగా బియ్యం తరలిస్తున్న గోదావరిఖనిలోని అడ్డగుంటపల్లికి చెందిన మోనుగుప్తపై కేసు నమోదు చేశామన్నారు.

కూల్‌డ్రింక్ అనుకుని.. గడ్డి మందు తాగిన విద్యార్థిని

- ఆస్పత్రికి తరలింపు

రాయికల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా ఇటిక్యాల ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో కూల్ డ్రింక్ అనుకుని పొరపాటున ఓ విద్యార్థిని శనివారం గడ్డి మందు తాగింది. గమనించిన హాస్టల్ సిబ్బంది వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు. రాయికల్ మండలంలోని ఇటిక్యాల ఆదర్శ పాఠశాల తేజస్విని అనే విద్యార్థిని ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె ఇటీవల ఇంటికెళ్లింది. ఇంటి దగ్గర గొడవ జరుగడంతో కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలుపుకుని శనివారం హాస్టల్‌కు వచ్చింది. ఆ బాటిల్‌ను హాస్టల్ గదిలో పెట్టి బయటకు వెళ్లింది. అదే సమయంలో తేజస్విని స్నేహితురాలు అమూల్య గదికి వచ్చింది. అక్కడ ఉన్న కూల్‌డ్రింక్ బాటిల్‌ను తీసుకుని తాగింది. గమనించిన తేజస్విని విషయాన్ని ప్రిన్సిపాల్‌కు వివరించింది. దీంతో వెంటనే అమూల్యను రాయికల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. అమూల్య ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

నగదు, ఆభరణాల చోరీ


బీరువాను ధ్వంసం చేసిన దండగులు

ఎల్లారెడ్డిపేట నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగంపల్లి, దుమాల గ్రామాల్లోని తాళం వేసి ఉన్న ఇళ్లు, దుకాణం, ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బండ లింగంపల్లి గ్రామంలోని మాచర్ల నరసవ్వ తన ఇంటికి వేసిన తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంటిలోని వస్తువులను చిందరవందరగా పడేశారు. 21 వేల రూపాయల విలువైన వెండి ఆభరణాలతో పాటు ఏడు వేల నగదును ఎత్తుకెళ్లారు. అదే గ్రామంలోని తిరుపతిరెడ్డి ఇంటిలో ప్రవేశించిన నిందితులు బీరువాను ధ్వంసం చేశారు. ఏం లభించకపోవడంతో అక్కడ నుంచి వెనుదిరిగారు. దుమాల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయంలోకి చొరబడి హుండీని ధ్వంసం చేశారు. అమ్మవారి బంగారు ఆభరణాలతో పాటు హుండీలోని వేయి రూపాయల నగదును ఎత్తుకెళ్లారు. ఆలయం సమీపంలోని దుకాణంలోకి వెళ్లిన నిందితులు ఐదు వేల నగదును చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పర్యాటక అభివృద్ధి ప్రశ్నార్థకమేనా..?

- కొండగట్టులో పత్తాలేని రోప్‌వే..
- కలగానే కోతుల పార్క్

మల్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎత్తైన గుట్టలు.. పచ్చని చెట్లు.. మైమరపించే అందాలు.. అన్నింటికీ మించికోతుల కిచకిచలు... ఇలాంటి ఇంకెన్నో.. ఇవి కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రత్యేకత.. అయితే పర్యాటకంగా అభివృద్ధి కించిత్తు మాత్రం ఇక్కడ కనిపించదు. కొండగట్టు పుణ్య క్షేత్రానికి నిత్యం వేలాదిగా, హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. ఇక్కడ పర్యాటక అభివృద్ధికి ఎంతో అవకాశం ఉన్నా దానిని పట్టించుకునేవారు లేకపోవడం గమనార్హం. పర్యాటక అభివృద్ధికి కొండగట్టు ఎంతో అనుకూలమైనప్పటికీ పట్టింపులేనితనం స్పష్టంగా కనిపిస్తోంది.


ప్రతిపాదించిన మెట్ల మార్గ స్థలం

ఊసేలేని రోప్‌వే పనులు..



కొండగట్టులో రోప్‌వే ఏర్పాటు చేయతలపెట్టగా అది ప్రతిపాదిత దశలోనే మిగిలిపోయింది. మెట్లదారి నుంచి ప్రస్తుత పుష్కరిణి వెనుక వైపు వరకు తాడు మార్గం (రోప్ వే)కు పదేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన కూడా చేశారు. పర్యాటక శాఖకు స్థలం అప్పగింత పనులు కూడా అయ్యాయి. ఆ శాఖ అధికారులు సైతం పలుమార్లు కొండగట్టును సం దర్శించి రోప్‌వే కోసం పరిశీలన జరిపారు. అనంతరం దాని ఊసే లేకుండాపోయింది. రోప్ వే అయితే ఇక్కడ పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉన్నా.. దానిని పట్టించుకునే వారే కరువయ్యారు.

కోతుల పార్క్ అంతే..

ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో ఏర్పాటు చేస్తామన్న కోతులు, జింకల పార్క్ లు కలగానే మిగిలిపోయాయి. గతంలో ఈ పార్క్‌ల కోసం అటవీ శాఖ, దేవాదాయ శాఖ అధికారుల మధ్య కేవలం ఉత్తర ప్రత్యుత్తరాలకే పరిమితమైపోగా ప్రస్తుతం పట్టింపు లేని ధోరణిపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది తమ ఇష్ట దైవమైన ఆంజనేయ స్వామి ప్రతిరూపంగా భావించే కోతుల సంఖ్య నానాటికి తగ్గుముఖం పడుతోంది. ఆహార అన్వేషణలో కొండ దిగి కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కోతులు తరచుగా భారీ వాహనాల కింద పడి మరణిస్తున్నాయి.

కొండగట్టు దేవస్థానానికి వచ్చే భక్తులను విశేషంగా ఆకర్షించే కోతుల సంరక్షణ కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వీటి ఉనికి ప్రశ్నార్థంగా మారుతోంది. కొండగట్టు కొండలలో దేవస్థానం పరిధిలో దాదాపుగా 400 ఎకరాల భూములు ఉన్నాయి. ఇందులో కోతులు, జింకల పార్క్‌ల కోసం కనీసం 200 ఎకరాలు భూమి అవసరముండగా ఇందుకు కావాల్సిన నివేదికను అటవీ శాఖతో పాటు జంతు ప్రదర్శన (పర్యావరణ) శాఖ అధికారులు తయారు చేయాల్సి ఉంటుంది. వారి మధ్య సమన్వయ లోపం, దేవాదాయ శాఖ, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో కోతుల పార్క్ కలగా మారుతోంది. కొండగట్టును పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉండగా ప్రజాప్రతినిధులు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇక్కడ పర్యాటకంగా అన్ని విధాల ఎంతో అనుకూలం అయినప్పటికీ పర్యాటక అభివృద్ధికి దూరంగా ఉండటం పట్ల ఈ ప్రాంతవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


కొండపైన కోతుల సమూహం

క్రైం కార్నర్

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మల్లాపూర్, నవంబరు, 9 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని వేంపల్లి వెంకట్రావుపేట గ్రామ శివారులోని గోదావరిలో గల్లంతైన పాకాల శ్రీవర్ధన్(18) మృత దేహం శనివారం లభ్యమైంది. రాయికల్ మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన శ్రీవర్ధన్ గ్రామంలో ఓ శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం వచ్చాడు. నది సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నాడు. అనంతరం గోదావరిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లం తయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి గజ ఈతగాళ్లతో గాలించినా ఆచూకీ తెలియలేదు. శనివారం ఉదయం నీటిపై తేలుతున్న శ్రీవర్ధన్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సింగిల్‌విండో చైర్మన్‌పై అట్రాసిటీ కేసు

పెగడపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వోరుగంటి రమణారావుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 5న మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకుడు చాట్ల విజయభాస్కర్ పార్టీ నాయకులతో కలసి ఉండగా కాంగ్రెస్ కార్యాలయం వద్దకు రమణారావు వచ్చారు. అకారణంగా గొడవకు దిగడమే కాకుండా విజయభాస్కర్‌ను కులం పేరుతో దూషించి అవమానించాడని ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప భక్తుడి మృతి


హరీష్(ఫైల్)

వేములవాడ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పమాల ధరించి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరిన రాజన్న సిరిసిల్ల జిల్లా యువకుడు పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌కు చెందిన వంగపల్లి హరీష్ (28) అనే యువకుడు పట్టణంలో టైల్స్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. హరీష్ అయ్యప్ప మాల ధరించి 25 రోజుల క్రితం శబరిమలకు పది మంది బృందంతో కలిసి వేములవాడ నుంచి పాదయాత్రగా బయలుదేరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ సమీపంలో రాత్రి బస చేశారు. శనివారం తెల్లవారుజామున తమ బృందంతో పాటు వెళ్లకుండా కాస్తా ముందుగా పాదయాత్రగా బయలుదేరి వెలుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొటింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ హరీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కరీంనగర్ ప్రాంతానికి చెందిన అయ్యప్పభక్తులు చూసి వేములవాడ భక్తులకు సమాచారం అందించారు. వారు హరీష్ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


అంబులెన్స్‌లో తరలిస్తున్న గ్రామస్థులు

చందుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలో శనివారం రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుద్దాల భూమయ్య ద్విచక్ర వాహనంపై ప్రధాన రహదారిపైకి వెళ్తున్నాడు. కోరు ట్ల నుంచి వేములవాడకు వెళ్తున్న పల్లె వెలుగు బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో భూమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం సిరిసిల్లలోని ఆస్ప త్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఏఎస్ఐ బాపు తెలిపారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల దాడులు

బోయినపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా వడ్డీ వ్యాపారుల ఇళ్లపై వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. స్తంభంపల్లి గ్రామంలోని కిరణ్‌రెడ్డి ఇల్లు, బోయినపల్లి మండల కేంద్రంలో రమేష్ అనే చిట్టి వ్యాపారి ఇంటిపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డీ పత్రాలతో పాటు చిట్టికి సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

● చందుర్తి నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలో అక్రమ వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని ఎనగల్ గ్రామంలో అక్రమ వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రెండు ఇళ్లలో పోలీసులు దాడులు నిర్వహించినట్లు సమాచారం. ఇటీవల గల్ఫ్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఇంట్లో వడ్డీ వ్యాపారం సంబంధించిన, ప్రామిసరీ నోట్లు, డాక్యుమెంట్లలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

ఒకరికి గాయాలు

హుజూరాబాద్, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లో శనివారం టిప్పర్ అదుపు తప్పి ట్రాలీ ఆటోను ఢీ కొట్టిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఓ పెళ్లి బృందం స భ్యులు ట్రాలీ ఆటోలో వెళ్తుండగా, వెనుక నుంచి మొరం టిప్పర్ అదుపు తప్పి ఢీ కొట్టింది. దీంతో మానకొండూర్ మండలానికి చెందిన ఓ వ్యక్తికి గాయా లయ్యాయి. సమాచారం మేరకు బ్లూకో ల్ట్ సిబ్బంది ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

చొప్పదండి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన మండ లంలోని రాగంపేటకు చెందిన నీలం లచ్చయ్య(68) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై అనూష తెలిపిన వివరాల ప్రకారం.. నీలం లచయ్య భార్య పదేళ్ల క్రితం చనిపోయింది. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. మూడు నెలల నుంచి లచ్చయ్య మద్యానికి బానిస య్యాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన చిన్న కుమారుడు కరీం నగర్‌కు తరలించాడు. వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లచ్చ య్య శనివారం మృతి చెందాడు. పెద్ద కుమారుడు నీలం శేఖర్ ఫిర్యాదు మే రకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అనూష తెలిపారు.

రోడ్ సైక్లింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన హృతికేశ్


హృతికేశ్‌ను అభినందిస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

కరీంనగర్ స్పోర్ట్స్ నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4, 5, 6 తేదీల్లో జనగామలో జరిగిన రాష్ట్రస్థాయి రోడ్ సైక్లింగ్ పోటీల్లో కరీంనగర్‌కు చెందిన హృతికేశ్ మాస్ స్టార్ట్ అంశంలో గోల్డ్ మెడల్ సాధించాడు. టైం ట్రైల్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా హృతికేశ్‌ను శనివారం తన నివాసంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ రోడ్ సైకిల్ పోటీలకు ఎంపికవడం అభినందనీయమని, నేషనల్‌లో కూడా మెడల్ సాధించి కరీంనగర్ జిల్లాకు గర్వకారణంగా నిలవాలని అన్నారు. హృతికేశ్‌ను రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యదర్శి విజయ్‌కాంత్‌రావు, దత్తాత్రేయ, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి, అధ్యక్షులు డాక్టర్ బి మధుసూదన్ రెడ్డిలు అభినందించారు.

అబద్ధాల పునాదుల మీద బీజేపీ ప్రభుత్వం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



సిరిసిల్లలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అబద్ధాల పునాదుల మీద కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నడుస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడారు. సువిశాల భారతదేశంలో జమిలి ఎన్నికలు సాధ్యంకావని మోదీ తన వైఖరిని మార్చుకోవాలన్నారు. జమ్ముకశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేసి గందరగోళం సృష్టించారన్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామా నియతృత్వ పాలనలో ఉన్నామా అన్నది అర్థం కావడం లేదన్నారు. రాజ్యాంగం మారుస్తాం.. మతోన్మాదం తీసుకొస్తామంటే మాత్రం పోరాటాల ద్వారా బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెపుతారన్నారు. ప్రశ్నించే గొంతుకలను కేంద్ర ప్రభుత్వం అనచివేస్తోందన్నారు. ప్రొఫెసర్ సాయిబాబను కుట్రకేసులో జైలుకు పంపిందన్నారు. సాయిబాబ నిర్దోషి అని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. దీనికి మోదీ బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతుందన్నారు. పక్కా ఇళ్ళు కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్స్ అందడం లేదన్నారు. గ్రామాల అభివృద్ధికి చేసిన పనుల బిల్లులు ఇచ్చి సర్పంచులను అప్పుల నుండి విముక్తి చేయాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం సిరిసిల్ల పవర్‌లూం పరిశ్రమకు దాదాపు రూ. 270కోట్లు అప్పు పెట్టి పోయిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బకాయిలను దాదాపు 70 శాతం చెల్లిందని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి 30 శాతం బకాయిలను చెల్లించి వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని కోరుతామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, నాయకులు సోమ నాగరాజు, మీసం లక్ష్మన్, మంద సుదర్శన్, జంగం అంజన్న, కేవీ అనసూయ్య, సమ్మయ్య, అశోక్ పాల్గొన్నారు.

● రాజన్న సిరిసిల్ల జిల్లాకు వచ్చిన సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డిని సిరిసిల్ల పాలిస్టర్ యజమానులు కొందరు కలిసి విద్యుత్ చార్జీలు, బకాయిల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించిన విద్యుత్ చార్జీల కేటగిరి, బకాయిలు వాటి వడ్డీ చెల్లింపులపై ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. సీపీఐ పక్షాన ప్రభుత్వానికి వినతిపత్రం అందిస్తామని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు.


రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

కోరుట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ నీలి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వెంకటేష్ శనివారం తెలిపారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి గుండేటి ధనుష్, తొమ్మిదవ తరగతి చదువుతున్న గంద్ర నరహరి పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో జరిగిన అండర్ 17 జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైట్లు వారు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ నీలి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వెంకటేష్‌లతో పాటు పాఠశాల డైరెక్టర్ల్, ఉపాధ్యాయులు అభినందించారు.

శివోహం



● ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనం.. శివప్రీతికరం
● కార్తీక మాసం.. శివకేశవుల ధ్యానం ● కార్తీక మాసం ప్రత్యేకం

కార్తీక మాసం.. శివకేశవులకు ప్రీతికరం.. భక్తులు భక్తిశ్రద్ధలతో ఆది దేవుడిని పూజిం చుకుంటారు. కార్తీక మాసంలో తెల్లవారుజామునే లేచి శివకేశవ ఆలయాల్లో దీపాలు వెలిగిస్తారు. సాయంకాలం నదుల్లో దీపారాధానలు చేస్తారు. బిల్వ పత్రార్చనలు, పంచా క్షరి మంత్ర పఠనం, తులసీదళ పూజలతో దేవాలయాలు ఆధ్యాత్మిక భరితంగా ఉంటాయి. ఓం నమః శివాయ అనే మంత్రోచ్చరణతో ఆలయాలు మార్మోగుతాయి. ద్వాదశ జ్యోతిర్లింగాలు ఆధ్యాత్మిక భావతరంగాలపై పరవశించి పోతాయి. కార్తీక మాసంలో జ్యోతిర్లింగాలను దర్శించుకునే ఆనవాయితీ ఉంది. పర్వదినాల సందర్భంగా ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రాశస్త్యం 'ఆంధ్రజ్యోతి' పాఠకుల కోసం..

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సౌరాష్ట్రలో సోమనాథుడు..



పన్నెండు జ్యోతిర్లింగాల్లో మొదటిది గుజరాత్‌లోని సౌరాష్ట్రలో వెలసిన సోమనాథ క్షేత్రం. సోముడు అంటే చంద్రుడు. లింగరూపుడై ఇక్కడ వెలసిన శివుడిని చంద్రుడు ఆరాధిస్తాడు. అందుకే సోమనాథ క్షేత్రంగా పిలుస్తారు. చంద్రుడు ప్రభాస తీర్థంలో శివునిపై విశేష తపస్సు చేశాడు. అనుగ్రహించిన శివుడు అమావాస్య నుంచి పౌర్ణమి వరకు కలలు వృద్ధి అయ్యే విధం గా పౌర్ణమి నుంచి అమా వాస్య వరకు క్షయమగునట్లు అనుగ్రహించినట్లు పురాణ గాథ. సోమనాథుని సందర్శించిన భక్తుల కు దీర్ఘ రోగాల నివారణ జరుగుతుందని నమ్మకం.

శ్రీశైలంలో మల్లికార్జునుడు..



ఆది దేవుడు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలంలో మల్లికార్జున స్వామిగా ఆరాధనలు అందుకుంటున్నాడు. శ్రీశైల శిఖర దర్శనం చేసిన వారికి పునర్జన్మ అనేది ఉండదని నమ్మకం. శ్రీశైల శిఖరాన్ని దర్శించిన వారికి సర్వ పాపాలు తొలగుతాయని భావిస్తారు. శ్రీశైలం కుమార స్వామిపై పుత్ర వాత్సల్యానికి ప్రతీకగా నిలిచింది. వినాయకుడికే గనాధిపత్యం ఇచ్చినందుకు తల్లిదండ్రులపై కోపంతో కుమారస్వామి శ్రీశైల పర్వతానికి వెళ్లిపోతాడు. కొంత కాలానికి పార్వతి మల్లిక రూపం, శివుడు అర్జున రూపంలో అక్కడికి వచ్చినట్లు చెప్పుకుంటారు. అందుకే మల్లికార్జున జ్యోతిర్లింగంగా శ్రీశైలం ఉంది.

ఉజ్జయినిలో మహాకాలేశ్వరుడు ..



మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో శిప్రా నదీ తీరంలో వెలసిన క్షేత్రం మహాకాలేశ్వరుడిది. ఇక్కడ స్వామి వారికి చితా భస్మాభిషేకం చేస్తారు. వేద ప్రియుడను బ్రాహ్మణుడిని దూషణుడను రాక్షసుడు హింసించేవాడు. వేద ప్రియుడు శివుని ప్రార్థించగా ప్రత్యక్షమై ఆ రాక్షసుడిని సంహరించాడు. అక్కడే మహాకాలేశ్వర జ్యోతిర్లింగంగా వెలిశాడు. ఈ క్షేత్రాన్ని సందర్శించిన వారికి అనుకున్న కోరికలు సాఫల్యమవుతాయని భక్తుల నమ్మకం.

నర్మదా తీరాన ఓంకారేశ్వరుడు



మధ్యప్రదేశ్‌లోని నర్మదా తీరంలో వెలసిన జ్యోతిర్లింగం రెండు భాగాలుగా ఉంటుంది. ఓంకారేశ్వర, అమరేశ్వర లింగంగా రెండు పేర్లతో పిలుస్తారు. ఈ క్షేత్రాన్ని సందర్శించిన వారికి జన్మ రాహిత్యాన్ని పొందుతారని భావిస్తారు. వింధ్యుడు అనే పర్వత రాజు నర్మదా నది తీరాన శివుని కోసం కఠోర తపస్సు చేసి ప్రత్యక్షం పొందుతాడు. వరం కోరుకొమ్మనగా తన శిరస్సుపై పరమశివునివై ఉండమని విద్యంతుడు కోరగా అలా ఓంకారేశ్వర జ్యోతిర్లింగంగా వెలిశాడు.

మహారాష్ట్రలో వైద్యనాథుడు



వైద్యనాథేశ్వరాలయం మహారాష్ట్రలో ప్రసిద్ధి పొందిన క్షేత్రం. రావణాసురుని శివభక్తికి నిదర్శనంగా నిలిచింది. తన శిరస్సులను ఖండిస్తూ రావణాసురుడు హోమం చేశాడు. శివుడు రావణుని కోరిక మేరకు శివలింగం మార్గమధ్యంలో ఎక్కడా భూమిపై ఉంచవద్దని చెప్పాడు. కొన్ని కారణాలతో భూమిపై ఉంచాల్సి వచ్చింది. దీంతో మహారాష్ట్రలో వైద్యనాథ జ్యోతిర్లింగంగా విలసిల్లుతుంది.

గుజరాత్‌లో నాగేశ్వరుడు..



గుజరాత్‌లో నాగేశ్వర క్షేత్రం నాగనాథ క్షేత్రంగా వెలుగొందుతోంది. శివ భక్తుడైన సుప్రియున్ని దారకుడనే రాక్షసుడు భక్షించడానికి ప్రయత్నించడంతో శివుడు ప్రత్యక్షమై ఆ రాక్షసుడిని సంహరిస్తాడు. అలా అక్కడే నాగనాథుడు అనే పేరుతో వెలసి జ్యోతిర్లింగ రూపుడై భక్తులకు దర్శనం ఇస్తున్నాడు. ఈ జ్యోతిర్లింగాన్ని దర్శించిన వారికి కోరికలు సిద్ధిస్తాయని మహా నమ్మకం.

మందాకినీ తీరంలో కేదారనాథుడు



కేదార శిఖరంలో ఉండడం వల్ల కేదారేశ్వరుడిగా ప్రసిద్ధి చెందాడు. ఉత్తరాంచల్‌లోని మందాకిని నదీ తీరంలో కేదారగిరిలో పరమశివున్ని నర నారాయణుడు బదరిక వనంలో పార్థీవ లింగ రూపంలో అభిషేకించి పూజించాడు. దాంతో పరమేశ్వరుడు ప్రత్యక్షమై అనుగ్రహించాడు. అలా కేదారేశ్వర జ్యోతిర్లింగంగా వెలుగొందుతోంది. ఈ జ్యోతిర్లింగాన్ని దర్శించిన వారికి కోరికలు సిద్ధిస్తాయని భావిస్తారు.

ఘృష్ణేశ్వర క్షేత్రం



మహారాష్ట్రలో ఉన్న జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ఘృష్ణేశ్వర క్షేత్రం ఒకటి. సుధర్ముడను బ్రాహ్మణుడికి సుదేహ, ఘృష్ణ అనే ఇద్దరు భార్యలు. ఘృష్ణకు కుమారుడు జన్మించగా సుదేహ అసూయతో ఆ బాలుడిని సమీపంలోని సరోవరంలో పడవేస్తుంది. ఘృష్ణ శివారాధనతో పూర్తి చేసిన లింగాన్ని సరోవరంలో కలిపేందుకు వెళ్లగా కుమారుడు బయటకు వస్తాడు. ఆమె భక్తికి మెచ్చి ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగంగా ఆ క్షేత్రంలో వెలిశాడని ప్రతీతి. ఈ క్షేత్రాన్ని దర్శించుకున్న వారు ఇహపర భోగాలు అనుభవిస్తారని నమ్మకం.

శ్రీరాముడు ప్రతిష్ఠించిన రామేశ్వరుడు..



ఈ క్షేత్రం తమిళనాడులో రామేశ్వర జ్యోతిర్లింగంగా వెలుగొందుతోంది. ఈ జ్యోతిర్లింగాన్ని దర్శించి పూజించిన వారు జీవన్ముక్తులవుతారని ప్రతీక. రామేశ్వర లింగాన్ని సాక్షాత్తు శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించాడు. రావణ వధ అనంతరం బ్రహ్మ హత్య దోశ నివృత్తి కోసం శ్రీరాముడు సీతా మాతతో కలసి ఇసుకతో చేసిన శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. అయితే కైలాసం నుంచి ఆంజనేయుడు ఆలస్యంగా తీసుకొచ్చిన శివలింగాన్ని ఆ ఇసుక లింగం పక్కనే ఉంచారు.

భీమేశ్వరక్షేత్రం



భీమేశ్వర క్షేత్రం మహారాష్ట్రలో ఉంది. భీముడనే రాక్షసుడు కుంభకర్ణుని కొడుకు తన తండ్రిని వధించినది శ్రీరాము డు అని తెలిసి ఘోర తపస్సు చేసి బ్రహ్మ నుంచి వరాలు పొందుతాడు. ఆ క్రమంలో సుదక్షిణుడు అనే రాజును చెరసాలలో బంధించాడు. అక్కడే ఆయన శివలింగాన్ని చేసి పరమశివున్ని ప్రార్థిస్తాడు. పూజను భీముడు భగ్నం చేయడంతో శివుడు ప్రత్యక్షమై ఆ రాక్షసుడిని భస్మం చేస్తాడు. అందుకే భీమ శంకర్ జ్యోతిర్లింగంగా ప్రసిద్ధి చెందింది. ఈ క్షేత్రాన్ని సందర్శిస్తే సంకటాలు తొలగిపోతాయని భావిస్తారు.

కాశీలో విశ్వనాథుడు..



కాశీ విశ్వనాథుడిగా పేరొందిన పరమ పుణ్య క్షేత్రం ఉత్తరప్రదేశ్‌లో వారణాసిలో ఉంది. ఈ క్షేత్రాన్ని సందర్శించిన వారికి అనుకున్న కోరికలు సాఫల్యమవుతాయని భావిస్తారు. ఈ క్షేత్రానికి ఆనందవనం, మహాస్మశానం అనే పేర్లు ఉన్నాయి. కాశీలో మరణం ముక్తిదాయకమని, మరణించే వారి కి విశ్వనాథుడే కుడి చెవిలో తారకమంత్రం ఉపదేశిస్తాడని పురాణ కథనం.

నాసిక్‌లో త్రయంబకేశ్వరుడు..



మహారాష్ట్ర నాసిక్‌లో వెలుగొందుతున్నది త్రయంబకేశ్వర క్షేత్రం. గౌతమ మహర్షి తపస్సుకు అనుగ్రహించి శివుడు గంగను ప్రసాదించి జటాజూటం నుంచి గోదావరి నదిని ప్రవహింపజేసి అనుగ్రహించిన పరమేశ్వరుడు త్రయంబకేశ్వర జ్యోతిర్లింగంగా వెలుగొందినట్లు భావిస్తారు.

వైభవంగా సీతారామచంద్ర స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయికల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాజీపేట గ్రామంలో సీతారామచంద్ర స్వామి దేవాలయంలో వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ సీతాముల వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అధ్యక్షుడు చెరుకు రాజేశ్వర శర్మ, అజయ్ శర్మ పర్యవేక్షణలో, వేద పండితుడు రాంగోపాల్ ఆచార్యులు, జగన్నాథ ఆచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోల రాజు, మాజీ ప్రజాప్రతినిధులు మోహన్, వాసరి రవి, జకిలేటి హరీష్ రావు, ఆకుల మహేష్, ఆలయ కమిటీ సభ్యులు చల్ల రాజేందర్, బోయిని నరేందర్, అయిండ్లేని గంగారెడ్డి, లింబయ్య, రాయికల్ సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి పాల్గొన్నారు.

నేడు కరీంనగర్‌కు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

-జిల్లా కోర్టు భవన సముదాయానికి శంకుస్థాపన

కరీంనగర్ లీగల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాదే ఆదివారం కరీంనగర్‌కు రానున్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని సుమారు ఎకరం స్థలంలో 81 కోట్ల రూపాయలతో నాలుగు అంతస్తులతో నిర్మించిన నూతన జిల్లా కోర్టు భవన సముదాయానికి ప్రధాన న్యాయమూర్తి శంకుస్థాపన చేస్తారు. అనంతరం న్యాయమూర్తుల రెసిడెన్షియల్ భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తారు. ఈకార్యక్రమాలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో పాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ పుల్ల కార్తీక్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ, ఇతర న్యాయమూర్తులు పాల్గొంటారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి కోరారు.

దరఖాస్తులకు గడువు పెంపు

చొప్పదండి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో 9,11వ తరగతిలో పరిమిత సీట్ల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువును ఈ నెల 19 వరకు పెంచినటు ప్రిన్సిపాల్ మంగతాయారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రన్సిపాల్ సూచించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

మెట్‌పల్లి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ గణేష్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ భీమారం మండలం కమ్మరిపేట గ్రామానికి చెందిన జవ్వాజి జలేందర్ (30) అనే వ్యక్తి మృతి చెందాడు. జలేందర్ మృతికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణం అంటూ బంధువులు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం జలేందర్ శనివారం ఉదయం జ్వరంతో ఆసుపత్రిలో చేరాడు. వైద్యులు అతడికి చికిత్స ప్రారంభించారు. సాయంత్రం సమ యంలో పరిస్థితి విషమంగా ఉందని వేరే ఆసుపత్రికి తీసుకెళ్లండి అం టూ వైద్యుడు బంధువులకు చెప్పాడు. దీంతో జలేందర్‌ను అక్కడి నుం చి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డ్యూటీలో ఉన్న వైద్యుడు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలపడంతో మృ తదేహాన్ని మొదట చేర్పించిన ఆసుపత్రికి తీసుకొచ్చి మూడు గంటల పాటు ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలానికి మెట్‌పల్లి ఎస్‌ఐ చిరంజీవి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి సముదాయించారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారణ చేపడతామని ఎస్‌ఐ హామీ ఇచ్చారు. జలేందర్‌కు భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘునందన్ రావుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు శనివారం పోలీసులు తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో బ్యాడ్ టచ్‌కు పాల్పడినట్లు తెలుసుకున్న బాలల సంరక్షణ శాఖ అధికారులు పాఠశాలకు వెళ్లి విచారణ చేశారు. ఈ విచారణ మేరకు బాలల సంరక్షణ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పాఠశాల హెచ్ ఎం పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు .



ధర్మపురిలో గోదావరి వద్ద గంగా హారతి పూజలు చేస్తున్న అర్చకులు



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

ఆలయాల్లో భక్తుల సందడి

- కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు
- పెద్ద సంఖ్యలో భక్తుల రాక
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు

వేములవాడ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ, ధర్మపురి ఆలయాల్లో శనివారం కార్తీక సందడి నెలకంది. వేములవాడ రాజరాజేశ్వ రస్వామి వారి క్షేత్రం శనివారం భక్తులతో సందడిగా మారింది. కార్తీక మాసం సందర్భంగా రాజన్న ఆలయానికి నిత్యం భక్తుల రద్దీ పెరుగుతూ వస్తుంది. ఈ క్రమంలో ఉదయం తెల్లవారు జామునే భక్తులు ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. అనంతరం ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం పార్వతిపరమేశ్వరులను దర్శించుకుని తరించారు. అనబంధ దేవాలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా రాజన్న ఆలయం ఆవరణలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు.

- ఆధ్యాత్మికతను పెంపొందించేందుకే ..

వేములవాడ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో ఆధ్యాత్మికతను పెంపొందించడం కోసమే సామూహిక కార్తీక దీపోత్సవాన్ని ఏర్పాటు చేశామని ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. రాజన్న ఆలయంలోని ఓపెన్‌స్లాబ్‌లో ఏర్పాటు చేసిన సామూహిక కార్తీక దీపోత్సవాన్ని శనివారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ శివపార్వతులకు ఎంతో ప్రీతిపాత్రమైన కార్తీకమాసంలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అందులో భాగంగానే నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో సామూహిక కార్తీక దీపోత్సవానికి హాజరై పలు ఆకృతుల్లో దీపాలను వెలిగించారు. భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. స్థానిక కళాకారులు నమిలికొండ జయంత్, సంతోష్ బృందం వారిచే నిర్వహించిన భక్త విభావరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఏఈవో గజవెల్లి రామేష్‌బాబు, సూపరిండెంట్‌లు తిరుపతిరావు, వరి నర్సయ్య, పీఆర్వో అశోక్ తదితరులు ఉన్నారు..

- ధర్మపురిలో..

ధర్మపురి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం కార్తీక భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం వరకు క్షేత్రానికి వేలాది మంది భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నర సింహ హోమం, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టు ప్రదక్షిణాలు చేసి కార్తీక దామోదరుడిని పూజించారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో నూ భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనేక మంది దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజించారు. అందంగా పూలతో అలంకరించిన స్వామి వా రలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు ని ర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ నేతృత్వంలో అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అల ువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శేషప్ప కళావేదిక పై అక్కపల్లి రాజ రాజేశ్వర భజనా మండలిచే భక్తి సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు.

- గోదావరి వద్ద శోభాయాత్ర..

కాగా ధర్మపురి క్షేత్రంలో ఎనిమిదవ రోజు శనివారం గోదావరి హారతి కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, తిరు మల సేవా గ్రూపు మహిళలు సాయంత్రం గోదావరి నదికి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నది వద్ద ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కు మార్ నేతృత్వంలో ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు సాం ప్రదాయ రీతిలో, శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి వరకు గోదావరి మాతకు హారతి ఇచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు నదిలో దీపాలు వదిలి మొక్కులు చెల్లించుకున్నారు.



ధర్మపురిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



సామూహిక కార్తీక దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కథలాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుంపెట, అంబారిపేట గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. అంబారిపేటలో సోమయ్యకు రు. 39 వేలు, దుంపెటలో కొత్తూరి లతకు రు. 45 వేలు, పులి నగేశ్‌కు రు. 10,500ల చొప్పున మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్య క్షుడు కాయితి నాగరాజు, ప్రధాన కార్యదర్శి జవ్వాజి రవి, ఎన్ఎస్‌యుఐ నియోజకవర్గ కన్వీనర్ ఆకుల సంతోష్, తీగల మధు తదితరులు ఉన్నారు.

హామీలు నెరవేర్చాలని ఎమ్మెల్యేకు వినతి

రాయికల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయాలని కోరుతూ రాయికల్ 4వ వార్డు కౌన్సి లర్ తురగ శ్రీధర్ రెడ్డి శనివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. రైతులకు రైతు భరోసా, దొడ్డు వడ్లకు బోనస్ మినహా మిగతా హామీలను వెంటనే అమలు చేసే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కొడిమ్యాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నమిలికొండ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎస్. జెస్సీ అండర్ 14 వాలీ బాల్ బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి ఎస్.జీ.ఎఫ్. పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ గోనె శివక్రిష్ణ తెలిపారు. విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అయిత శ్రీనివాస్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మెల్యే పరామర్శ

మల్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బొజ్జ మొండయ్య ఇటీవల అనారోగ్యానికి గురి అయి విశ్రాంతి తీసుకుంటుండగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు లక్ష్మారెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నేరెళ్ల సతీష్‌రెడ్డి, ఆగంతం వంశీధర్, సంత ప్రకాష్‌రెడ్డి, కట్కం వినయ్, నక్క అనిల్, కిషన్‌రెడ్డి, తిరుపతి ఉన్నారు.

కొమిరెడ్డి జ్యోతిదేవి మృతి పార్టీకి తీరనిలోటు

సంతాపం తెలిపిన జువ్వాడి సోదరులు

కోరుట్ల/మెట్‌పల్లి టౌన్ నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కోమిరెడ్డి జ్యోతిదేవి మృతి పార్టీకి తీరని లోటని కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాదులోని బేగంపేట ఎయిర్‌పోర్ట్ వద్ద బెంగుళూర్ నుంచి విమానం ద్వారా జ్యోతిదేవి పార్థవదేహాన్ని కుటుంబ సభ్యులు తీసుకురాగా మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి సంతాపం ప్రకటించారు. అనంతరం ప్రత్యేక వాహనం ద్వారా ఆమె మృతదేహాన్ని మెట్‌పల్లి పట్టణానికి తరలించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల వివరాలను జువ్వాడి సోదరులు అడిగి తెలుసుకు న్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేసిన కోమిరెడ్డి రాములు - జ్యోతిదేవి లేని లోటు తీర్చలేదని అన్నారు.

●జ్యోతిదేవి భౌతికకాయం ఇంటికి చేరడంతో ఆమె


జ్యోతిదేవి భౌతికకాయానికి నమస్కరిస్తున్న కృష్ణారావు

అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రేపు ఉదయం 10-30 గంటలకు అంత్యక్రియలను నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. మెట్‌పల్లి నుంచి అంతిమయాత్రగా బయలుదేరి వెంకట్రావ్‌పేట శివారులోని వారి వ్యయ సాయక్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాజకీయ నాయకుల సంతాపం...

మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి మరణం పట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు మాట్లాడుతూ ఆమె మరణం నియోజకవర్గ ప్రజలకు తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు అంజిరెడ్డి జ్యోతి దేవి మరణం పట్ల సంతాపం ప్రకటించారు.

● జ్యోతిదేవి మరణం మహిళ లోకనికి తీరని లోటని మెట్‌పల్లి మాజీ జడ్పీటీసీ పూదరి అరుణ అన్నారు. జ్యోతి మరణం పట్ల దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. తను జడ్పీటీసీగా జ్యోతిదేవి మెట్‌పల్లి ఎంపీపీగా కలిసి పని చేశామని గుర్తు చేసుకున్నారు.

అభ్యసనా సామర్థ్యాలు మెరుగయ్యేనా..?

(5వ పేజీ తరువాయి..)

సెపెంబర్ 10వ తేదీన, 30వ తేదీన, నవంబర్ 8వ తేదీన మాక్ టెస్టులు నిర్వహించారు. ప్రధాన పరీక్ష డిసెంబర్‌లో 4వ తేదీన నిర్వహించనున్నారు. ఈ సారి జాతీయస్థాయి సాధన పరీక్షలో రాష్ట్ర స్థానాన్ని మెరుగుపరిచేందుకు జిల్లాల వారీగా కార్యాచరణను నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, పంచాయతీరాజ్, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ స్కూళ్లోని మూడు, ఆరు, తొమ్మిది తరగతులు చదువుతున్న విద్యార్థులందరినీ ఇందుకు అనుగుణంగా సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షకు దాదాపు 20వేలకుపైగా విద్యార్థులు హాజరవనున్నారు.

మంచి ఫలితాలు రాబట్టేలా కార్యాచరణ..

- జగన్ మోహన్ రెడ్డి, జిల్లా విద్యాధికారి, జగిత్యాల



ప్రతీ మూడేళ్లకోసారి జాతీయ స్థాయిలో నిర్వహించే సర్వే పరీక్ష (న్యాస్) ద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మదిస్తారు. ఈ సారి జిల్లాలో మంచి ఫలితాలను రాబట్టేలా పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. ఇందులో భాగంగానే ఉపాధ్యాయులకు ఇదివరకే తగిన శిక్షణను అందించాం. త్వరలో నిర్వహించే ప్రధాన పరీక్షకు ముందు మాదిరి పరీక్షలను మూడు సార్లు నిర్వహిస్తున్నాం.

చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ సివిల్ కోర్టు జడ్జి డి. నాగేశ్వర్‌రావు

మెట్‌పల్లి టౌన్, నవంబర్ 9(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగహన కలిగి ఉండాలని సినియక్ కోర్టు సివిల్ జడ్జి, మండల్ లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ డి. నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాల, కాలేజ్‌లో జాతీయ లీగల్ సర్వీసెస్ దినోత్సవాన్ని పురస్కరించుకోని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా కోర్టు జడ్జి డి. నాగేశ్వర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలపై అవగహన పెంచుకుంటే భవిష్యత్తులో సమాజానికి మెరుగైన సేవలు అందించవచ్చని అన్నారు. దేశంలో ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా జీవిస్తున్నాడు అంటే వాటికి చట్టాలే కారణమన్నారు. జూనియర్ కోర్టు సివిల్ జడ్జి అరుణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, ఇతర వ్యాసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, న్యాయవాదులు వెంకటనర్సయ్య, ఆనంద్‌గౌడ్, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, ఎస్ఐ అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ తిరుపతి పాల్గొన్నారు.

సూర్యారావు కుటుంబ సభ్యులకు పరామర్శ

ధర్మపురి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి సూర్యారావు ఇటీవల మృతి చెందగా శనివారం మాజీ మంత్రులు మోత్కుపెల్లి నర్సింహులు, గొడిసెల రాజేశంగౌడ్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిద్దరు వేర్వేరుగా మొదట సూర్యారావు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబ సభ్యులకు వారు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కుచాడి శ్రీహరిరావు, నిర్మల్ జిల్లా మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు పడాల శ్రీనివాస్, సీనియర్ వైద్యులు డాక్టర్ రమేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వీఆర్‌వో యూనియన్ జిల్లా అధ్యక్షులు దిగంబర్‌రావు, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షులు కొట్టె శేఖర్, నిర్మల్ ఏఎంసీ డైరెక్టర్ వెంకటేష్, జీవన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు .

వేంకటేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ


ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్న భక్తులు

కోరుట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం శనివారం గోవింద నామ స్మరణలతో మారు మోగింది. దీంతో దేవలయాల పరిసరాలు భక్తులతో కిటకిటలాడింది. కార్మిక మాసం, మాస తిరునక్షత్ర (స్వామి వారి పుట్టిన రోజు) పురస్కరించుకుని వేడుకలను నిర్వహించారు. వేదపండితుడు బీర్నంది నర్సింహచారీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చన అభిషేక కార్యాక్రమాలను జరిపారు. దేవాలయంలో వేకవజామునే భక్తులు చేరుకోని 108 ప్రదక్షణాలను నిర్వహించారు. భక్తులు 108 ప్రదక్షణలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల కార్యాక్రమాలలో మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్య - అనిల్, మాజీ దేవాలయ చైర్మెన్‌లు పుప్పాల ప్రభాకర్, జక్కుల ప్రసాద్‌లు పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. వేంకటేశ్వర భజన మండలీ ఆద్వర్యంలో భజన కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ విక్రం, ఆలయ జూనియర్ అసిస్టెంట్ నర్సయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి

పెగడపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని పెగడపల్లి తహసీల్దార్ బి.రవీందర్ పేర్కొన్నారు. శని, ఆదివారం రెండు రోజులు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో బాగంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని తహసీల్దార్ శనివారం సందర్శించి నూతన ఓటరు ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు తమ పేరు నమోదు చేసుకోవాలని, దీనికి గాను విద్యావంతులు, యవజన సంఘాలు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గిర్దావర్‌లు జమున, శ్రీనివాస్, బిఎల్‌వోలు ఉన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు కొండపైకి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బేతాళుడి వద్ద కూడా పూజలు చేశారు.

ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్ సిబ్బంది పర్యవేక్షించారు. సాయంత్రం కార్తీక దీపారధన చేశారు.

వేంకటేశ్వర ఆలయంలో శ్రవణా నక్షత్ర పూజలు

మెట్‌పల్లి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణా నక్షత్ర పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. శనివారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకోని ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయ పురోహితుడు వామన చక్రపాణి నేతృత్వంలో స్వామి వారి సుప్రభాతం, పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను చేపట్టారు. భక్తులు బ్రహ్మ ముహూర్తంలో ఆలయానికి చేరుకున్న మహిళలు భక్తి శ్రద్ధలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి కోరికలు నెవేరాలని కార్తీక మాస దీపం వెలిగించారు. అనంతరం ఆలయం చుట్టూ 108 ప్రదిక్షిణాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహకులు నల్ల జనార్దన్, నల్ల శేఖర్, సామల గణేష్, ఏనుగు బచ్చిరెడ్డి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులు, మహిళలు, పాల్గొన్నారు.

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య

ధర్మపురి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్ తెలిపారు. ధర్మపురి మండలంలోని ఆరెపల్లి, మగ్గిడి, జైనా గ్రామాల్లో జైనా పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసాలకు గురికావద్దని అన్నారు. రైతులు కష్టించి పండించిన ధాన్యాన్ని 17 శాతం తేమతో కొనుగోలు కేంద్రానికి తీసుక వచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఏ గ్రేడ్ రూ 2360, బీ గ్రేడ్ రూ 2300 నిర్ణయించినట్లు ఆమె వివరించారు. రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు కలుగనీయకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం జైనా పీఏసీఎస్ చైర్మన్ సొళ్ల నరేష్ ఆధ్వర్యంలో ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య, వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, పాలకవర్గ సభ్యులు మదుకర్‌రెడ్డి, రఫియొద్దీన్, గడ్డం రాజన్నను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షులు రాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్, ఏఎంసీ కార్యదర్శి కోరుట్ల శ్రీనివాస్, కురిక్యాల మహేష్, సీఈవో బలుమూరి సాగర్ రావు, రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు


సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

కొడిమ్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. 75 మంది దంపతులు స్వామి వారి వ్రతంలో పాల్గొన్నారు. ఆలయం చుట్టు గోవిందనామ స్మరణతో స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులు గ్రామస్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. అంతకు ముందు స్వామి వారికి సహస్ర పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి నాగరాజు రమేష్, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

సర్వేలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలి

● ఆర్డీవో జివాకర్‌రెడ్డి


మోహన్‌రావుపేటలో సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కోరుట్ల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ సర్వేలో బృంద సభ్యులు నమోదు వివరాలలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని ఆర్డీవో జివాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని నాగులపేట, సంగెం గ్రామాలలో ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే కార్యక్రమాన్ని ఆర్డీవో పరిశీలించగా మండలంలోని చిన్నమెట్‌పల్లిలో తహసీల్దార్ కిషన్ సర్వే బృందంతో కలిసి సర్వే నిర్వహించారు. మోహన్‌రావుపేట గ్రామంలో ఎంపీడీవో రామకృష్ణ సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో సిబ్బందికి పలు సూచనలు సలహాలను అందించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహస్తున్న సమగ్ర కటుంబ సర్వేను బృందాలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయలు, అవగన్‌వాడి టీచర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటింటి కుటుంబ సర్వే

మల్యాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం అయింది. మండలంలోని 19 గ్రామాల్లో 100మంది ఎన్యుమరేటర్లతో ఇంటింటా సర్వే చేశారు. మొదటి రోజు సర్వే వివరాల సేకరణ ఆలస్యం కాగ ప్రజలు కుటుంబ, తదిదర వివరాలు తెలుపడానికి ఇబ్బంది పడ్డారు. సర్వేను ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీన్ పర్యవేక్షించారు..

ఉద్యోగులకు పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

●ఎంఈవోలకు ప్రభుత్వ వాహనాలు కేటాయించాలి ●ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్

బీర్‌పూర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఎంఈవోలకు ప్రభుత్వం ప్రత్యేక వాహనాలను కేటాయించాలని, ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మచ్చ శంకర్, ప్రధానకార్యదర్శి బైరం హరికిరణ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం బీర్‌పూర్ మండలంలో బీర్‌పూర్, నర్సింహులపల్లి, తుంగూర్ గ్రామాలలో గల జిల్లా పిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాల నుంచి సభ్యత్వ నమోదు తీసుకున్నారు. అదే సమయంలో నూతనంగా బీర్‌పూర్ మండల ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన నాగభూషణంను ఎస్టీయూ నాయకులు శాలువాలు కప్పి సన్మానించిన అనంతరం స్టేట్ టీచర్స్ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఎంపీడీవోలకు, తహసీల్దార్‌లకు ప్రభుత్వ వాహన సౌకర్యం ఇతర అలెవెన్స్‌లు చెల్లిస్తున్నట్టే ఎంఈవోలకు కూడా అలాంటి సౌకర్యం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒకటి జూలై 2023 నుంచి రావాల్సి పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు కూడా ప్రజాక్షేత్రంలో భాగమేనని వారి సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాల్సి బాధ్యత ఉందన్నారు. ప్రాథమిక పాఠశాలలో బోధిస్తున్న ఎస్టీటీల కు సైతం ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఉచిత హెల్త్ కార్డులు జారీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయులు పేరి మంజునాథ్, నరేష్, బీర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ మూర్తి పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేస్తున్న తీసుకుంటున్న నాయకులు

దేవుళ్ల చిత్రపటాలు పెట్టేందుకు కుండీలు ఏర్పాటు చేయాలి

● మున్సిపల్ కమిషనర్‌కు వినతి వీహెచ్‌పీ నేతలు

ధర్మపురి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదా వరి నది వద్ద దేవుళ్ల చిత్రపటాలు పడవేసేందుకు ప్రత్యేక కుండీలు ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు శనివారం వీహెచ్‌పీ నేతలు వినతి పత్రాన్ని సమర్పించారు. కొందరు భక్తులు తమ ఇళ్లలో వాడిన పాత దేవుళ్ల చిత్రపటాలను ధర్మపురి క్షేత్రానికి తీసుక వచ్చి గోదావరి నదిలో విచ్చలవి డిగా పార వేస్తున్నారని తెలిపారు. దీంతో స్నానాలు చేసే భక్తులకు చిత్రపటాలకు సంబందించిన గాజులు గుచ్చుకుని నానా ఇబ్బందులకు గురువుతున్నారని పేర్కొన్నారు. గోదావరి నదిలో చెత్తా చెదారాన్ని తొలగించి, ప్రత్యేక కుండీలు ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో వీహెచ్‌పీ కస్తూరి రాజన్న, అల్లం దుర్గప్రసాద్, ఈరిశెట్టి మనీష్, కాశెట్టి హరీష్, తిరుమన్ దాసు సత్యనారా యణ, బుచ్చన్న, భాస్కర్ ఉన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు

సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

● మున్సిపల్ కమిషనర్ టి. మోహన్

మెట్‌పల్లి టౌన్, నవంబర్ 9(ఆంధ్రజ్యోతి): సమ గ్ర కుటుంబ సర్వేను పకడ్బందిగా నిర్వహించాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ సిబ్బందికి సూచించారు. శనివారం పట్టణంలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులలో సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. నిన్నటి వరకు స్టికర్ కార్యక్రమం నిర్వహించామని నేటి నుంచి సమగ్ర ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వేకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేషన్ సిబ్బంది వెంకటేష్, మధులత, శేఖర్, ముజీబ్ పాల్గొన్నారు.

ఇంటింటీ సర్వేను తనిఖీ చేసిన ఎంపీడీవో

కథలాపూర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కులగణన శనివారం నుంచి ప్రారం భమైన నేపథ్యంలో ఎంపీడీఓ శంకర్ సర్వేను పరిశీలించారు. పలు గ్రామాల్లో ఎన్యుమరేటర్లకు ఏర్పడ్డ సందేహాలను నివృత్తి చేశారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. మండలంలోని 9 మంది సూపర్‌వైజర్లు సర్వేను పర్యవేక్షణ చేస్తున్నారు.


మెట్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

మల్యాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆసరా చేసుకొని కొంత మంది అపరిచిత వ్యక్తులు ఇళ్లలోకి వచ్చి ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ వివరాలు అడిగే అవకాశం ఉందని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఏ.నరేశ్ కుమార్ మండల వాసులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఫోన్ నంబర్లు, ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. అనుమానితుల పట్ల తమకు సమాచారం అందించాలని కోరారు.

సుకన్య సమృద్ధి యెజనను సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్లరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సుకన్య సమృద్ధి యెజన పథకంను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శనివారం మండలంలోని మాదాపూర్ గ్రామంలో పోస్టల్ సిబ్బంది విస్తృతంగా ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు. సుకన్య పథకంలో ఆర్‌డీ, టీడీ, ఎబీ, ఎఐఎస్ డిపాజిట్లతో పాటు ఇన్సూరెన్సూ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అధికారి అంజయ్య, మాజీ సర్పంచ్ దారిశెట్టి రాజేష్, బీజేపీ నాయకుడు దారిశెట్టి గణేష్, గ్రామస్తులు బద్దం దేవారెడ్డి, ప్రసాద్, నాయిని ప్రసాద్, కడపల్లి భాస్కర్‌లతో పాటు పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మాలి

● ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్ రెడ్డి

వెల్గటూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో అమ్మి లబ్ది పొందాలని ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక జితేందర్ రెడ్డి కోరారు. శనివారం మండలంలోని పైడిపల్లి, రాంనూర్, శాఖాపూర్, సంకెనపల్లి, కోటిలింగాల, గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్లు గూడ రాంరెడ్డి, రత్నాకర్, ఏపీఎం చంద్రకళ, నాయకులు మెరుగు మురళి, సందీప్‌రెడ్డి, ఉదయ్‌గౌడ్, రమేష్, జగదీశ్వర్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రవీణ్, మంజుల, భూమయ్య, శ్రీనివాస్, విజయ్, రాయ కోట య్య, కొమురయ్య, సీసీలు, కమిటీ సభ్యులు, వివోఏలు పాల్గొన్నారు.